PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 253 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- సోమవారం 07 సెప్టెంబర్ 2026


## పేద వృద్ధ మహిళలకు మధురమ్మ ట్రస్ట్ చేయూత




## రెడ్‌క్రాస్ ప్రాణమ్ సెంటర్‌లో ఘనంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం




# ఢిల్లీలో కూలిన భవనం.. ముగ్గురి మృతి

**ఢిల్లీలోని సత్య నికేతన్‌లో ఘోర ప్రమాదం**

**ఈ ప్రమాదంలో ముగ్గురు మరణించగా, పలువురిని కాపాడిన సహాయక బృందాలు**

**మరమ్మతు పనులు చేస్తుండగా పాత భవనం కూలిపోయినట్లు వెల్లడి**

**ప్రభుత్వ నిర్లక్ష్యంపై విపక్షాలు ఆగ్రహం, ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్**

**శిథిలాల కింద పలువురు విద్యార్థులు చిక్కుకున్నట్లు అనుమానాలు**



**ఢిల్లీ సెప్టెంబర్ 06(పిసిడబ్ల్యూ న్యూస్):**
దేశ రాజధాని ఢిల్లీలో ఆదివారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సౌత్ ఢిల్లీలోని సత్య నికేతన్ ప్రాంతంలో మరమ్మతు పనులు జరుపుకుంటున్న ఐదంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు మృతి చెందగా, ఇప్పటివరకు ఆరుగురిని సహాయక బృందాలు సురక్షితంగా వెలికితీశాయి. **మిగతా 2లో...**

# ఇస్రో ప్రైవేటీకరణ అవాస్తవం

**ప్రైవేటీకరణ వార్తలను ఖండించిన భారత అంతరిక్ష సంస్థ**

**మా పాత్ర తగ్గదు, మరింత కీలకమవుతుందని స్పష్టీకరణ**

**అధునాతన పరిశోధనలపై దృష్టి పెడతామన్న ఇస్రో**

**ప్రైవేట్ రంగ భాగస్వామ్యం సామర్థ్యాన్ని పెంచడానికేనని వెల్లడి**




**ఢిల్లీ సెప్టెంబర్ 06(పిసిడబ్ల్యూ న్యూస్):**
భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను ప్రైవేటీకరిస్తున్నారంటూ గత కొద్ది రోజులుగా మీడియాలో వస్తున్న ఊహాగానాలకు సంస్థ ఆదివారం పూర్తిస్థాయిలో తెరదించింది. ఇస్రోను ప్రైవేటీకరించే ఆలోచన లేదని, దేశ అంతరిక్ష ప్రయోగాలలో దాని ప్రాధాన్యం ఎప్పటికీ తగ్గదని స్పష్టం చేసింది **మిగతా 2లో....**

# సాత్విక్-చిరాగ్ సంచలనం..

**చైనా మాస్టర్స్ టైటిల్ సొంతం**



**చైనా మాస్టర్స్ సూపర్ 750 టైటిల్‌ను గెలుచుకున్న సాత్విక్-చిరాగ్**

**ఫైనల్‌లో చైనా జోడీపై హోరాహోరీ పోరులో విజయం**

**తొలి గేమ్ కోల్పోయినా అద్భుతంగా పుంజుకున్న భారత ద్వయం**

**ఈ సీజన్‌లో సాత్విక్-చిరాగ్ జోడీకి ఇది రెండో టైటిల్**

**గాయాలతో బాధపడుతున్నా అద్భుత ప్రదర్శన కనబర్చిన భారత జోడీ**

**ఢిల్లీ సెప్టెంబర్ 06(పిసిడబ్ల్యూ న్యూస్):**
భారత స్టార్ బ్యాడ్మింటన్ ద్వయం సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి సంచలనం సృష్టించారు. ప్రతిష్ఠాత్మక చైనా మాస్టర్స్ సూపర్ 750 పురుషుల డబుల్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. షెన్‌జెన్‌లోని అరీనాలో ఆదివారం జరిగిన హోరాహోరీ ఫైనల్‌లో చైనా జోడీ **మిగతా 2లో...**

# కొత్త పింఛన్లకు దరఖాస్తులు

**నేటి నుంచి 16 వరకు స్వీకరణ**

**ఎన్టీఆర్ భరోసాలో కొత్త అధ్యాయం**

**మరింత మందికి సామాజిక భద్రత**

**ఇప్పటికే 62 లక్షల మందికి భరోసా**

**కొత్త పింఛన్ల ప్రక్రియకు ప్రత్యేక ఏర్పాటు**

**అమరావతి, సెప్టెంబర్ 06(పిసిడబ్ల్యూ న్యూస్):**
రాష్ట్రంలో కొత్త పింఛన్లకోసం ఎంతగానో ఎదురు చూస్తున్న పేదలకుప్రభుత్వం తీపి కబురు అందించింది. నేటి నుంచి ఈనెల 16వరకు దరఖాస్తులు స్వీకరించనుంది. ఇప్పటికే సామాజిక భద్రత పింఛన్లతో 62 లక్షల మంది పేదలకు ప్రతినెలా ఆర్థిక భరోసా కల్పిస్తున్న కూటమి ప్రభుత్వం, ఇప్పుడు ఆ భరోసాను మరింత విస్తరించేందుకు సిద్ధమైంది. అర్హులైన పేదలు, వృద్ధులు, వితంతువులు,దివ్యాంగులు, ఇతర బలహీన వర్గాలకు కొత్తగా అవకాశం కల్పిస్తూ ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకంకింద తాజా దరఖాస్తుల స్వీకరణకు శ్రీకారం చుట్టింది. **మిగతా 2లో...**



# మూడేళ్లలో డ్రగ్స్ రహిత భారత్

**నాలుగు స్థాయిల్లో నార్కో సమన్వయ కేంద్రాలు**

**మార్చి2029 నాటికి మత్తు చిత్తు**

**కేంద్ర హోం మంత్రి అమిత్ షా**

**పనాజీ:సెప్టెంబర్ 06(పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదివారం గోవాలోమీడియాతో మాట్లాడుతూ, 2029 నాటికి భారతదేశాన్నిపూర్తిగా మాదకద్రవ్య రహితంగా మార్చేందుకు మోడీ ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసిందనితెలిపారు. మాదకద్రవ్యాలు లేని యువశక్తి 2047 నాటికివికసిత భారత్ను నడిపిస్తుందనేది ప్రధాని నరేంద్ర మోడీలక్ష్యమని పేర్కొన్నారు. నక్సలిజం, ఉగ్రవాదం వంటి ముప్పులను ఎలా **మిగతా 2లో...**



# ప్రతిపక్ష హోదాను అపహాస్యం చేస్తున్న కేసీఆర్

**తక్షణం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయండి**

**: మహాధర్నాలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ డిమాండ్**

**బీఆర్ ఎస్ పదేండ్ల పాలన.. కాంగ్రెస్ రెండున్నరేండ్ల పాలనపై చర్చకు సిద్ధమంటూ సవాల్**

**హాజరైన మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం,**






# అసెంబ్లీ సమావేశాల తర్వాత పాదయాత్ర

**కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా కేసీఆర్ భారీ ఉద్యమం**

**కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులపై నిర్లక్ష్యమే ప్రధాన కారణమన్న హరీశ్ రావు**

**సీఎం రేవంత్ భాష వల్లే కేసీఆర్ సభకు రావట్లేదన్న వెల్లడి**

**అసెంబ్లీ లోపల, బయట సర్కారును నిలదీయాలని బీఆర్ఎస్ నిర్ణయం**

**ముందు రేవంత్ రాజీనామా చేయాలని డిమాండ్**

**హైదరాబాద్ : సెప్టెంబర్ 06(పిసిడబ్ల్యూ న్యూస్):**
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ సిద్ధమైంది. సోమవారం ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల తర్వాత, కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేరుగా భారీ ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించనున్నారని పార్టీ ప్రకటించింది.

ఆదివారం ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. సమావేశం అనంతరం **మిగతా 2లో...**

# 8 హైకోర్టులకు కొత్త చీఫ్ జస్టిస్‌లు..

**హైదరాబాద్ : సెప్టెంబర్ 06(పిసిడబ్ల్యూ న్యూస్):** దేశంలోని న్యాయవ్యవస్థలో కీలక నియామకాలు జరిగాయి. సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సుల మేరకు ఎనిమిది హైకోర్టులకు కొత్త ప్రధాన న్యాయమూర్తులను (సీజే) నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు **2లో...**



# ఉప్పాడ రక్షణ గోడ నిర్మాణానికి సర్వే పనులు ప్రారంభం

**డిజైన్, డీపీఆర్ రూపకల్పన కోసం రంగంలోకి ఐఐటీ మద్రాస్ నిపుణులు**

**డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చొరవతో కదులుతున్న పనులు**

**అమరావతి, సెప్టెంబర్ 06(పిసిడబ్ల్యూ న్యూస్):**
దశాబ్దాలుగా సముద్ర కోతతో విలవిలలాడుతున్న పిఠాపురం నియోజకవర్గంలోని ఉప్పాడ తీరప్రాంత వాసుల చిరకాల స్వప్నం సాకారం దిశగా కీలక ముందడుగు పడింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక చొరవతో తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణానికి సంబంధించిన పనులు వేగవంతమయ్యాయి. **మిగతా 2లో...**



# ఏపీ కాంగ్రెస్‌కు కొత్త ఇన్‌ఛార్జ్.. పీవీ మోహన్‌కు బాధ్యతలు

**ప్రస్తుత ఇన్‌ఛార్జ్ మాణికం ఠాగూర్‌పై వేటు**

**ఏపీకి చెందిన సిరివెళ్ల ప్రసాద్‌కు మహారాష్ట్ర ఇన్‌ఛార్జ్ బాధ్యతలు**

**పంజాబ్‌కు సచిన్ పైలట్, అస్సాంకు భూపేష్ భగేల్ ఇన్‌ఛార్జ్‌లు**

**నియామకాలను ప్రకటించిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్**



**అమరావతి, సెప్టెంబర్ 06(పిసిడబ్ల్యూ న్యూస్):**
అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) పార్టీలో పలు కీలక మార్పులు చేపట్టింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా కర్ణాటకకు

**మిగతా 2లో...**

# రెడ్‌క్రాస్ ప్రాణమ్ సెంటర్‌లో ఘనంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

**హనుమకొండ,సెప్టెంబర్ 06(పిసిడబ్ల్యూ న్యూస్):** స్థానిక రెడ్‌క్రాస్ ప్రాణమ్ సెంటర్‌లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. కొమురయ్య పెండ్యాల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి బూర రామచందర్ సంధానకర్తగా వ్యవహరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ వైద్యులు డాక్టర్ విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ, గురువుల మార్గదర్శకత్వంలోనే తాను వైద్యుడిగా స్థిరపడ్డానని గుర్తు చేసుకుంటూ తన చిన్ననాటి ఉపాధ్యాయులకు ప్రణామాలుర్పించారు. సభాధ్యక్షులు కొమురయ్య పెండ్యాల మాట్లాడుతూ.. భారత రత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్ప తత్వవేత్తగా, దేశ రెండో రాష్ట్రపతిగా అందించిన సేవలు అమోఘమని, ఉపాధ్యాయ లోకానికి ఆయన సదా ఆదర్శనీయులని పేర్కొన్నారు. గురు పూజోత్సవం రోజున విద్యారంగానికి సేవలు అందించిన 12 మంది సీనియర్ రిటైర్డ్ ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. టీచర్స్ డే సందర్భంగా నిర్వహించిన క్యారమ్స్ డబుల్స్ పోటీల్లో విజేతలైన వి. అశోక్ రెడ్డి, వి. సాంబయ్య (విన్నర్స్), బూర రామచందర్, రంగరాజు గోవర్ధన్ (రన్నర్స్)లకు ముఖ్య అతిథి చేతుల మీదుగా జ్ఞాపికలను అందజేశారు.





సెంటర్‌కు రిటైర్డ్ ఎమ్ఆర్ఓ పి.వి. శ్రీనివాసరావు రెండు క్యారమ్ బోర్డుల సెట్లను, రిటైర్డ్ ఎక్సైజ్ ఎస్ఐ మట్టపల్లి భిక్షపతి ఒక క్యారమ్ బోర్డు సెట్‌ను స్ట్రైకర్, లైట్ డూమ్ లు స్వచ్ఛందంగా విరాళంగా ప్రకటించారు. దాతలకు కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గిరబోయిన రాజేందర్ ధన్యవాద సమర్పణ చేసిన ఈ కార్యక్రమంలో దాదాపు 65 మంది సీనియర్ సిటిజన్లు, విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

---

# ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి జన్మదిన వేడుకలు

**● రక్తదాన శిబిరం, అమ్మవారి విగ్రహం బహూకరణ**



**హనుమకొండ,సెప్టెంబర్ 06(పిసిడబ్ల్యూ న్యూస్):** హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి జన్మదిన వేడుకలను ఇనగాల యువసేన, కాంగ్రెస్ నాయకులు గుడెప్పాడ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు రక్తదానం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం ఇనగాల వెంకట్రామ్ రెడ్డి కి అమ్మవారి విగ్రహాన్ని బహూకరించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇనగాల యువసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షులు, హన్మకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ బొజ్జ భాను, మాజీ ఎంపీటీసీ కొమ్ముల భాస్కర్, నాయకులు కుక్కల జగపతి, మైదానం ప్రవీణ్, దాసరి నరేష్, చెక్క రంజిత్, కుక్కల వినయ్, కొమ్ముల వంశీ, ఎండి. యాఖూబ్, గునిగటి సునీల్, ఎన్ ఎస్ ఆర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆటో కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**● జమ్మికుంటలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ**



**జమ్మికుంట:సెప్టెంబర్ 06(పిసిడబ్ల్యూ న్యూస్):** ఆటో కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జమ్మికుంట పట్టణంలో ఆటో డ్రైవర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ఆటో కార్మికులు నిరసన ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు ఆర్థిక సహాయం అందించాలని, ప్రమాద బీమా కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కార్మికులు కోరారు. ఆటో కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నిరసన ర్యాలీకి జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్, కేడీసీసీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా వైస్ చైర్మన్, పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, మాజీ మార్కెట్ చైర్మన్ పోల్సాని సత్యనారాయణ తదితర నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆటో కార్మికుల సంక్షేమం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో కార్మిక సంఘాల నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, పెద్ద సంఖ్యలో ఆటో కార్మికులు పాల్గొన్నారు.

---

# జీవనశైలితో.. పోరాటం



**ఒకప్పుడు స్వచ్ఛమైన ఆహారం.. నేడు విషతుల్యమైన ఆహారం**

**కష్టార్జితమంతా.. ఆరోగ్యాన్ని కొనుక్కోవడానికేనా?**

**గుడ్ లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోట పుల్లయ్య**

**కల్లూరు, సెప్టెంబర్ 6 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఒకప్పుడు ప్రకృతి ఆధారిత పద్ధతుల్లో పండించిన పంటలు, ఇంటి వంటకాలు, చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, సీజనల్ పండ్లతో ప్రజల జీవనం ఆరోగ్యంగా ఉండేదని ప్రస్తుతం ఆధునిక జీవనశైలి, రసాయనాల వినియోగం, ప్రాసెస్డ్ ఫుడ్, శారీరక శ్రమ తగ్గిపోవడంతో ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని గుడ్ లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోట పుల్లయ్య అన్నారు. ప్రస్తుత పరిస్థితులపై ఆయన మాట్లాడుతూ మన పూర్వీకులు ఏం తిన్నారు మనం ఏం తింటున్నాం అనే విషయాన్ని ఒక్కసారి ఆలోచిస్తే మార్పింటో అర్థమవుతుందన్నారు. వ్యవసాయం వ్యాపారంగా మారడంతో అధిక దిగుబడుల కోసం రసాయనాల వినియోగం పెరిగిందన్నారు. మరోవైపు ప్యాకేజ్డ్, ప్రాసెస్డ్ ఫుడ్, అధిక చక్కెర, ఉప్పు, కొవ్వు కలిగిన ఆహారంతో పాటు శారీరక శ్రమ తగ్గడం, నిద్రలేమి, ఒత్తిడి అనారోగ్యానికి కారణమవుతున్నాయని పేర్కొన్నారు. **వ్యాధి వచ్చిన తర్వాత పరుగులు ఎందుకు?** ఆరోగ్యం దెబ్బతిన్న తర్వాత ఆసుపత్రుల చుట్టూ తిరగడం కంటే ముందుగానే జీవనశైలిని మార్చుకోవడం ముఖ్యమన్నారు. స్థానికంగా లభించే తాజా ఆహారం, ఇంటి వంట, నిత్య వ్యాయామం, తగినంత నిద్ర, మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మనం నేలను కాపాడితే నేల మనల్ని కాపాడుతుంది. స్వచ్ఛమైన ఆహారం ఆరోగ్యానికి రక్షణ. ఆరోగ్యాన్ని ఆసుపత్రిలో మాత్రమే కాదు మన వంటగదిలో, మన రోజువారీ అలవాట్లలో కాపాడు కోవాలని అన్నారు. ఆధునిక జీవనశైలిని పూర్తిగా వదిలేయడం సాధ్యం కాకపోయినా అందులో ఆరోగ్యకరమైన అలవాట్లను భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. డబ్బు పోతే తిరిగి సంపాదించుకోవచ్చు కానీ కోల్పోయిన ఆరోగ్యాన్ని పూర్తిగా తిరిగి పొందడం ఎల్లప్పుడూ సాధ్యం కాదు అన్నారు. అందుకే వ్యాధితో పోరాడే ముందు మన జీవనశైలితో పోరాడాలని అన్నారు. భవిష్యత్తులో ట్రస్ట్ చేపట్టే కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు.

---

# 8న 18 వేల మంది హైదరాబాదుకు తరలివెళ్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

**● ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలి ● రూ.2 వేల కోట్ల బకాయిలు విడుదల చేయాలి ● చలో అసెంబ్లీకి 18 వేల మంది ఉద్యోగులు సిద్ధం**

**తొర్రూరు ప్రతినిధి, సెప్టెంబర్ 6(పిసిడబ్ల్యూ న్యూస్):** పదవి విరమణ పొందిన ఆర్టీసీ ఉద్యోగుల సత్తా ఏమిటనేది 8వ తేదీ న అసెంబ్లీ ముట్టడిలో తెలుస్తుందని గతంలో పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించిన పెట్టారని ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని పదవి విరమణ పొందిన ఉద్యోగులందరికీ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఆర్టీసీలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని రిటైర్డ్ ఉద్యోగుల ఐక్యవేదిక మండల అధ్యక్షుడు గూడెల్లి చంద్రయ్య, కార్యదర్శి పంజాల వెంకన్న గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం తొర్రూరు విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2017 నుంచి ఇప్పటివరకు పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు వేతన సవరణలకు సంబంధించిన ఏరియర్స్, డిఫరెన్స్‌తో పాటు ఇతర బకాయిలు చెల్లించకుండా ఆర్టీసీ యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తోందని వారు ఆరోపించారు. తక్కువ వేతనాలతో 4045 ఏళ్ల పాటు సంస్థలో సేవలందించిన రిటైర్డ్ ఉద్యోగులు ప్రస్తుతం పెన్షన్, బకాయిలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2017, 2021 వేతన సవరణలకు సంబంధించిన బకాయిలతో పాటు ఇటీవల పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు



రావాల్సిన గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, చివరి నెల జీతం తదితర బకాయిలు కూడా చెల్లించాల్సి ఉందన్నారు. మొత్తంగా రిటైర్డ్ ఉద్యోగులకు సుమారు రూ.2 వేల కోట్ల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. బకాయిల కోసం గత ఏడాది కాలంలో రిటైర్డ్ ఉద్యోగులు బస్ భవన్ ఎదుట నాలుగుసార్లు శాంతియుత నిరసనలు, ధర్నాలు, ఉపవాస దీక్షలు చేపట్టారని చెప్పారు. ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్, ఇతర ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రాలు అందించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం వెంటనే స్పందించి బకాయిలను విడుదల చేయాలని కోరుతూ సెప్టెంబర్ 8న 'చలో అసెంబ్లీ' కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా బకాయిలు రావాల్సిన సుమారు 18 వేల మంది రిటైర్డ్ ఉద్యోగులు హాజరుకానున్నారని వెల్లడించారు. బకాయిలు అందక అప్పులు తీర్చలేక, పిల్లల వివాహాలు చేయలేక ఇబ్బందులు పడుతున్న రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రూ.2 వేల కోట్ల బకాయిలను విడుదల చేసి ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు న్యాయం చేయాలని గూడెల్లి చంద్రయ్య, పంజాల వెంకన్న గౌడ్ డిమాండ్ చేశారు.



---

# పేద వృద్ధ మహిళలకు మధురమ్మ ట్రస్ట్ చేయూత

**- 40 మందికి చీరల పంపిణీ**



**జమ్మికుంట:సెప్టెంబర్ 06(పిసిడబ్ల్యూ న్యూస్):** పేదలు, వృద్ధులకు అండగా నిలుస్తూ పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం శాలపల్లిఇందిరానగర్ గ్రామంలో పేద వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. గ్రామపంచాయతీ సూచించిన 40 మంది పేద వృద్ధ మహిళలకు ట్రస్ట్ నిర్వాహకులు, సామాజిక కార్యకర్త డాక్టర్ గంగిశెట్టి జగదీశ్వర్, సర్పంచ్ కోడిగూటి కిరణ్ చేతుల మీదుగా చీరలను అందజేశారు. **"వృద్ధుల సంక్షేమం మనందరి బాధ్యత": సర్పంచ్ కోడిగూటి కిరణ్** ఈ సందర్భంగా సర్పంచ్ కోడిగూటి కిరణ్ మాట్లాడుతూ.. "వృద్ధులకు సమయానికి ఆహారం అందేలా చూడడంతో పాటు, వారి ఆరోగ్య సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి అవసరమైన సహాయం అందించాలి. వృద్ధులు తమ శేష జీవితాన్ని సంతోషంగా గడిపేలా చూడటం మనందరి బాధ్యత. ప్రతి సంవత్సరం పేదలకు చీరలు పంపిణీ చేస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మధురమ్మ ట్రస్ట్‌ను అభినందిస్తున్నాం. మా గ్రామంలోని పేద వృద్ధ మహిళలకు చీరలు అందించినందుకు ట్రస్ట్ నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు" అని తెలిపారు. సామాజిక సేవలో భాగంగా పేద వృద్ధ మహిళలకు మధురమ్మ ట్రస్ట్ అందిస్తున్న సహకారం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కే. శ్రీధర్ రెడ్డి, జీవన్‌తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# గండ్రపల్లిలో నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం

**- కాపర్ వైర్ చోరీ.. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రైతుల ఆందోళన**



**జమ్మికుంట:సెప్టెంబర్ 06(పిసిడబ్ల్యూ న్యూస్):** జమ్మికుంట మండలంలోని గండ్రపల్లి గ్రామంలో దుండగులు నాలుగు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, అందులోని కాపర్ వైర్‌ను చోరీ చేశారు. ఒకేసారి నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం కావడంతో ఆయా ప్రాంతాల్లోని పంట పొలాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.విద్యుత్ సరఫరా లేకపోవడంతో పంటలకు నీరు అందించేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటలకు కీలక సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ ఘటనపై గ్రామ సర్పంచ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దుండగుల కోసం గాలింపు చేపట్టారు. రాత్రి వేళల్లో పంట పొలాల వద్ద కాపలా లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైర్‌ను చోరీ చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

# గురువులకు వందనం.. ఆధ్యాత్మిక సేవలకు పురస్కారం

**● ఆర్.కె. కళా సాంస్కృతిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో**

**ఘనంగా పురస్కార మహోత్సవం**





**హైదరాబాద్, సెప్టెంబర్ 6(పిసిడబ్ల్యూ న్యూస్):**
డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఆర్.కె. కళా సాంస్కృతిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువులకు వందనం ప్రతిభా సేవా పురస్కార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ ఆదూరి ఉదయ భాస్కర్‌రావు కి ఆధ్యాత్మిక పురస్కారం అందజేశారు. మాతృదేవోభవ పితృదేవోభవ.. ఆచార్యదేవోభవ అనే గురు పరంపరను స్మరించుకుంటూ, ఆదూరి ఉదయ భాస్కర్‌రావు ఆధ్యాత్మిక ప్రస్థానానికి దోహదపడిన తల్లిదండ్రులు, గురువులను ఈ సందర్భంగా స్మరించారు. కీర్తిశేషులు ఆదూరి విశాలాక్షి, తండ్రి ఆదూరి వెంకట సుబ్బారావు, పెద్దమ్మ రావినూతల సత్యవతి, మేనమామ, కుర్తాళం పీఠాధిపతులు శ్రీ శ్రీ విశుతానంద భారతి రెండవ స్వామివారి అనుగ్రహంతో తన ఆధ్యాత్మిక ప్రయాణం కొనసాగిందని నిర్వాహకులు తెలిపారు.**క్రియాయోగం, ధ్యానంపై సాధకులకు మార్గదర్శనం** హిమాలయన్ మాస్టర్ మహావతార్ బాబాజీ మార్గంలో శ్రీ విద్యాపరమైన క్రియాయోగ దీక్షను 2000 సంవత్సరంలో గురుపూర్ణిమ చంద్రగ్రహణం సందర్భంగా డాక్టర్ అరిపిరాల విశ్వం గురువుగారి ద్వారా స్వీకరించినట్లు పేర్కొన్నారు.పరమగురువుల జ్ఞానాన్ని ఆన్‌లైన్ తరగతుల ద్వారా పలువురు సాధకులకు అందిస్తూ, మంత్రజ్ఞానం, యోగం, ధ్యానం, క్రియాయోగం తదితర ఆధ్యాత్మిక అంశాలపై మార్గదర్శనం చేస్తున్నట్లు తెలిపారు.**ఆధ్యాత్మిక సాధనలకు విస్తృత సేవలు** శ్రీ మహాలక్ష్మి సాధనలో భాగంగా 12 అమావాస్యల పాటు సంవత్సర కాలం గోశాలలో యజ్ఞ కార్యక్రమాలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే ఆషాఢ అమావాస్య సందర్భంగా పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

# గురువులకు వందనం.. ఆధ్యాత్మిక సేవలకు పురస్కారం

**● ఆర్.కె. కళా సాంస్కృతిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో**

**ఘనంగా పురస్కార మహోత్సవం**






**హైదరాబాద్, సెప్టెంబర్ 6(పిసిడబ్ల్యూ న్యూస్) :** డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఆర్.కె. కళా సాంస్కృతిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువులకు వందనం ప్రతిభా సేవా పురస్కార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆదూరి ఉదయ భాస్కర్‌రావు కి ఆధ్యాత్మిక పురస్కారం అందజేశారు.మాతృదేవోభవ పితృదేవోభవ.. ఆచార్యదేవోభవ అనే గురు పరంపరను స్మరించుకుంటూ, ఆదూరి ఉదయ భాస్కర్‌రావు ఆధ్యాత్మిక ప్రస్థానానికి దోహదపడిన తల్లిదండ్రులు, గురువులను ఈ సందర్భంగా స్మరించారు. కీర్తిశేషులు ఆదూరి విశాలాక్షి, తండ్రి ఆదూరి వెంకట సుబ్బారావు, పెద్దమ్మ రావినూతల సత్యవతి, మేనమామ, కుర్తాళం పీఠాధిపతులు శ్రీ శ్రీ విమలానంద నంద భారతి రెండవ స్వామివారి అనుగ్రహంతో తన ఆధ్యాత్మిక ప్రయాణం కొనసాగిందని నిర్వాహకులు తెలిపారు.**క్రియాయోగం, ధ్యానంపై సాధకులకు మార్గదర్శనం** హిమాలయన్ మాస్టర్ మహావతార్ బాబాజీ మార్గంలో శ్రీ విద్యాపరమైన క్రియాయోగ దీక్షను 2000 సంవత్సరంలో గురుపూర్ణిమ చంద్రగ్రహణం సందర్భంగా డాక్టర్ అరిపిరాల విశ్వం గురువు ద్వారా స్వీకరించినట్లు పేర్కొన్నారు.పరమగురువుల జ్ఞానాన్ని ఆన్‌లైన్ తరగతుల ద్వారా పలువురు సాధకులకు అందిస్తూ, మంత్రజ్ఞానం, యోగం, ధ్యానం, క్రియాయోగం తదితర ఆధ్యాత్మిక అంశాలపై మార్గదర్శనం చేస్తున్నట్లు తెలిపారు.**ఆధ్యాత్మిక సాధనలకు విస్తృత సేవలు** శ్రీ మహాలక్ష్మి సాధనలో భాగంగా 12 అమావాస్యల పాటు సంవత్సర కాలం గోశాలలో యజ్ఞ కార్యక్రమాలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే ఆషాఢ అమావాస్య సందర్భంగా పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

# రవీంద్రభారతిలో అంగరంగ వైభవంగా మహా గురువుల గురుపూజోత్సవం

**ఆర్కే కళా సంస్కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘన కార్యక్రమం**

**ఆధ్యాత్మిక గురువు ఆచార్య తిరునగరి వెంకటేశ్వర స్వామికి ఘన సన్మానం**







**హైదరాబాద్ సెప్టెంబర్ 06 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆర్కే కళా సంస్కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహా గురువుల గురుపూజోత్సవ కార్యక్రమం ఆదివారం రవీంద్రభారతి వేదికగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మిక గురువు ఆచార్య తిరునగరి వెంకటేశ్వర స్వామిని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న పుల్లేటికుర్తి సంజయ్, వ్యాగ్రా లక్ష్మీ, విశ్వనాథ, నాగేంద్ర కుమార్ తదితరులు మాట్లాడుతూ.. తిరునగరి వెంకటేశ్వర స్వామి గురుముఖంగా తాము తీసుకున్న ఆధ్యాత్మిక సాధనను 41 రోజులపాటు నమ్మకంతో కొనసాగించామని తెలిపారు. ఆ సాధన ద్వారా తమకు అద్భుతమైన ఫలితాలు లభించాయని పేర్కొన్నారు. గురువు గురుపూజ మహోత్సవానికి హాజరుకావడం తమకు ఎంతో గర్వంగా ఉందన్నారు.విశ్వహిందూ ఐక్యతే విశ్వశాంతికి మూలంపూజ్య గురువులు తిరునగరి వెంకటేశ్వర స్వామి మాట్లాడుతూ గురుపూజ కార్యక్రమాలు సనాతన సంప్రదాయంలో అఖండ భారతదేశంలో ప్రాచీన కాలం నుంచి నేటి వరకు ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించబడుతున్నాయని అన్నారు. ధర్మో రక్షతి రక్షితః అనే హిందూ ధర్మ సిద్ధాంతమే దీనికి ప్రధాన కారణమని పేర్కొన్నారు.భారతదేశం కర్మభూమి, ధర్మభూమి అని, విశ్వహిందూ ఐక్యతే విశ్వశాంతికి మూలమని ఆయన అన్నారు. అఖండ హిందూ సంస్కృతిలోని కట్టు, బొట్టు, ఆచారాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు నేటి యువతను మరింతగా ఆకట్టుకుంటున్నాయని తెలిపారు.నేటి విశ్వహిందూ యువత ఆధ్యాత్మిక తరంగంగా ముందుకు సాగుతోందని, ప్రపంచ దేశాలకు భారతీయ సనాతన సంస్కృతి తలమానికంగా నిలుస్తోందని తిరునగరి వెంకటేశ్వర స్వామి వ్యాఖ్యానించారు.కార్యక్రమంలో ఆధ్యాత్మిక గురువులు, కళాకారులు, ఫౌండేషన్ ప్రతినిధులు, భక్తులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

# ఉప్పల్ ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక

**మంద కృష్ణ మాదిగ ఆదేశాలతో**

**సంస్థాగత నిర్మాణానికి శ్రీకారం**

**కొత్త మండల కమిటీని ప్రకటించిన నాయకత్వం**

**కోరపాక అంజి మాదిగ ఆధ్వర్యంలో సమావేశం**



**ఉప్పల్, సెప్టెంబర్ 6(పిసిడబ్ల్యూ న్యూస్):**పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, మండల ఇంచార్జ్ కోరపాక అంజి మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ఉప్పల్ ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఉప్పల్ నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా ఇంచార్జ్‌లు తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, కేశపాగ రాంచందర్ మాదిగ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లా మాజీ అధ్యక్షులు పంగ ప్రణయ్ కుమార్ మాదిగ సమావేశానికి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఉప్పల్ మండలంలో పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ నాయకత్వాన్ని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. అనంతరం ఉప్పల్ ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీని ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా మిద్దెపాక క్రాంతి మాదిగ, ప్రధాన కార్యదర్శిగా దాసరి యాదగిరి, ఉపాధ్యక్షులుగా చిలుకూరి శ్రీకాంత్, మోతే సురేష్ మాదిగ, కోరపాక యోగేష్ మాదిగ, జి. మహేష్ బాబులను ఎంపిక చేశారు. కార్యవర్గ సభ్యులుగా తాళ్లపల్లి మహేష్, కందుల రాజు, చింత మధు తదితరులను ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

# 30 మంది రోగులతో గుర్తురు నుండి హైదరాబాద్‌కు వెళ్లిన మెడికల్ బస్సు

**- గ్రామ సర్పంచ్ విసంపల్లి కవితా బాలకృష్ణ వెల్లడి**

**- రోగులకు ధైర్యం నింపి పంపించిన విసంపల్లి బాలకృష్ణ**



**తొర్రూరు ప్రతినిధి, సెప్టెంబర్ 6(పిసిడబ్ల్యూ న్యూస్):** గ్రామంలో అందరూ ఆరోగ్యవంతులుగా ఉండాలని మా ధ్యేయం అంటున గుర్తురు గ్రామ సర్పంచ్ కవితా బాలకృష్ణ.గ్రామ సర్పంచిగా గెలిచిన అనంతరం ఇది రెండవ మెడికల్ క్యాంపు గా గ్రామస్తులందరికీ గత నాలుగు రోజుల క్రితం వైద్య పరీక్షలు నిర్వహించి వివిధ రకాల జబ్బులతో బాధపడుతున్న గ్రామస్తులను వారి బాధలను గుర్తించి హైదరాబాదులోని మల్లారెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కు పంపించడం జరిగిందని కవితా బాలకృష్ణ పేర్కొన్నారు. మల్లారెడ్డి మెడికల్ ఇన్స్టిట్యూట్ లోని వైద్యులు ఓబుల్ రెడ్డి సలహా సూచనల మేరకు సర్పంచ్ కవితా బాలకృష్ణ ఆధ్వర్యంలో ఈ మెడికల్ క్యాంపు నిర్వహించడం జరిగింది. మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలంలోని గుర్తుర్ గ్రామంలోగత నాలుగు నెలల క్రితం గ్రామంలోని కంటి బాధలతో బాధపడుతున్న వృద్ధులను ఇదే ఇన్స్టిట్యూట్ కు పంపించి వారికి తగిన కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. గ్రామం నుండి బయలుదేరిన 30 మంది రోగులకు ఆసుపత్రిలో ఐదు రోజులు వైద్య పరీక్షలు నిర్వహించి గ్రామం నుండి తీసుకువెళ్లిన బస్సులోని తిరిగి క్షేమంగా ఇల్లు చేర్పించుకునే బాధ్యత మాపై ఉందని విసంపల్లి బాలకృష్ణ పేర్కొన్నారు. వైద్య పరీక్షలకు వెళ్లిన వారందరి యోగక్షేమాలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అధైర్య పడకుండా ఉండేందుకు వారితో పాటు గ్రామం నుండి ఒక ఇద్దరిని పంపించామన్నారు. బస్సులో వెళ్ళిన రోగులకు అన్ని రకాల వస్తువులను ఇనిస్ట్యూట్ వారే ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. వైద్య పరీక్షల కోసం వెళ్ళిన రోగులందరూ క్షేమంగా తిరిగి రావాలని మనము కోరుకుందాం.

# సమాజానికి సంపద జర్నలిస్టులు

**- జర్నలిస్టులకు సన్మానం గౌరవప్రదమైనది**

**- వాసవి క్లబ్ రీజియన్ చైర్మన్ (విఎన్ కెసిజిఎఫ్) దాసా శ్రీనివాసరావు**




**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 6 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సమాజానికి సంపద జర్నలిస్టులు అని వాసవి క్లబ్ రీజియన్ చైర్మన్ (విఎన్ కెసిజిఎఫ్) దాసా శ్రీనివాసరావు అన్నారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రసేన గుప్త 107వ జయంతిని పురస్కరించుకొని జరుగుతున్న వారోత్సవాలలో భాగంగా ఆదివారం జర్నలిస్టుల దినోత్సవం సందర్భంగా ఖమ్మం పులిపాటినగర్ వాసవిక్లబ్ వారి సౌజన్యంతో జర్నలిస్టులను శాలువలతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా దాసా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో సమాజ అభ్యున్నతికి పాటుపడే వారిని గుర్తించి సన్మానించడం ఆనవాయితీగా ఉందన్నారు. అందులో భాగంగానే ప్రజలకు ప్రభుత్వానికి వారధులైన సీనియర్ జర్నలిస్టులు టిఎస్ చక్రవర్తి, కొరకొప్పుల రాంబాబు, కొమిరే వెంకటేశ్వర్లు, మేడి రమేష్ లను శాలువలతో సత్కరించి ఘనంగా సన్మానించడం జరిగిందన్నారు. రీజియన్ సెక్రెటరీ బూర్ల పుల్లారావు, అధ్యక్షులు కొదుమూరి భద్రయ్య, సెక్రటరీ సిద్ధంశెట్టి శ్రీకాంత్, వజినేపల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు: ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ



**ఉప్పల్ సెప్టెంబర్ 06 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కృష్ణ హోటల్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ మేడ్చల్‌మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఉప్పల్ సర్కిల్, రామంతపూర్ డివిజన్‌లో ADRM హాస్పిటల్ నుంచి ఓల్డ్ రామంతపూర్ వరకు సుమారు కోటి రూపాయల వ్యయంతో డాంబర్ రోడ్డు నిర్మాణం చేపట్టారని తెలిపారు. రోడ్డు నిర్మాణంలో నిర్లక్ష్యం కారణంగా మొదట ఒక్క లేయర్ మాత్రమే వేసి, ప్రజల విజ్ఞప్తుల అనంతరం సుమారు ఆరు నెలల తర్వాత రెండో లేయర్ వేశారని ఆరోపించారు. అయితే అండర్‌గ్రౌండ్ మ్యాన్‌హోల్స్ వద్ద ఉన్న కవర్లను రోడ్డు స్థాయికి సమంగా ఏర్పాటు చేయకుండా సుమారు 60 మ్యాన్‌హోల్ కవర్ల పనులను పెండింగ్‌లో ఉంచడంతో రోడ్డు గుంతలమయంగా మారిందని పేర్కొన్నారు. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రమాదాలకు ఈ రహదారి అడ్డాగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో మ్యాన్‌హోల్ కవర్లు, రోడ్డు గుంతల కారణంగా ప్రజలకు ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. ఈ సమస్యపై మేడ్చల్‌మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సంబంధిత అధికారులకు ప్రజలు పలుమార్లు ప్రత్యక్షంగా విజ్ఞప్తి చేసినప్పటికీ ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. "ప్రజలు పడుతున్న ఇబ్బందులు అధికారులకు కనిపించడం లేదా? రోడ్డు వేసి సంవత్సరం గడుస్తున్నా ఈ సమస్య ఎందుకు పరిష్కారం కావడం లేదు? మరి ఎవరికి చెప్పాలి? ఈ సమస్యను ఎవరు పరిష్కరిస్తారు? అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారు? అధికారులు ఎవరి కోసం పనిచేస్తున్నారు?" అని ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ప్రశ్నించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మ్యాన్‌హోల్ కవర్లను రోడ్డు స్థాయికి సమంగా ఏర్పాటు చేసి, రోడ్డు గుంతలను పూడ్చి ప్రమాదాలను నివారించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్, ఆర్‌పీ రఘు ప్రకాష్, తెడ్డు రవీందర్ రావు, సిద్ధగోని రాజు గౌడ్, ఆటో కుమార్, వినోద్ చారి తదితరులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి 'మల్లెల' ఫౌండేషన్ అండ..!

- జలగం ఎల్లయ్య కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత
- కొరపాక అంజి ఆధ్వర్యంలో కార్యక్రమం
- కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా ఫౌండేషన్



**ఉప్పల్, సెప్టెంబర్ 6(పిసిడబ్ల్యూ న్యూస్):** నాచారం విలేజ్‌కు చెందిన జలగం ఎల్లయ్య మృతి చెందిన విషయం తెలుసుకున్న మల్లెల నర్సింగ్ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కొరపాక అంజి ఆధ్వర్యంలో ఈ సాయం అందజేశారు. కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడమే లక్ష్యంగా ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు పొన్నాల మహేందర్, నాచారం డివిజన్ ఎమ్మార్పీఎస్ నాయకులు చింత మధు, మోతే సురేష్, తాళ్లపల్లి మహేష్, కందుల రాజు, కోటూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కల్లూరులో ఘనంగా మువ్వా విజయబాబు జన్మదిన వేడుకలు

### కాటేపల్లి మట్టూరి జనార్ధన్ ఆధ్వర్యంలో కోకో పోటీలు.. విజేతలకు బహుమతులు







**కల్లూరు, సెప్టెంబరు 6 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఐడిసి చైర్మన్ మువ్వా విజయబాబు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కల్లూరులో అభిమానులు, కాంగ్రెస్ నాయకులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. మువ్వా అభిమాన నాయకుడు, అత్యంత ప్రియమైన సోదరుడు కాటేపల్లి కిరణ్ కుమార్, మట్టూరి జనార్ధన్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్‌తో పాటు విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించే ఉద్దేశంతో కోకో పోటీలు నిర్వహించారు. కల్లూరు ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మండలంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులతో కోకో పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొదటి నుంచి నాలుగో స్థానం వరకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులు తెలిపారు. అనంతరం కల్లూరు మున్సిపాలిటీ ప్రధాన కూడలిలో భారీ కేక్‌ను కట్ చేసి మువ్వా విజయబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని, ప్రజాసేవలో మరింత ముందుకు సాగుతూ రాజకీయంగా ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్, వైస్ చైర్‌పర్సన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, షుగర్ కేన్ చైర్మన్ కాస్తల నరేంద్ర, సంతాన వేణుగోపాల స్వామి ఆలయ చైర్మన్ ధారా రంగ, పేరువంచ గ్రామ సర్పంచ్ కీసర నిర్మల మోహన్ రెడ్డి, ముచ్చరం వైస్ ప్రెసిడెంట్ వైకుంఠ శ్రీను, టీడీపీ నాయకుడు జాస్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు యాస శ్రీకాంత్, బెరెల్లి మాధవ్, ఖమ్మంపాటి వీరస్వామి, జిల్లెల భాస్కర్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు తక్కెళ్లపాటి ప్రసాద్, పెద్దబోయిన శ్రీనివాసరావు, లోకం, చెన్నూరు చంటి బుజ్జాయి, వేము దినకర్, బైర్ల కాంతారావు, నోటి కృష్ణారెడ్డి, మద్దిబోయిన నాగరాజు, కట్టా గోపాలరావు, మురళీ, ధరావత్ రవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎఐసిసి రాష్ట్ర అధ్యక్షులుఏనుష్ కుమార్ ఆధ్వర్యంలోను మువ్వా విజయబాబు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఏనుష్ కుమార్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏనుష్ కుమార్ మాట్లాడుతూ మువ్వా విజయబాబు ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవిస్తూ ప్రజాసేవలో కొనసాగాలని, రాజకీయంగా మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

# భారత వ్యాపార రత్న" అవార్డుతో సంజయ్ వ్యాఘ్రుకు ఘన సత్కారం

### - రవీంద్రభారతి వేదికగా ప్రతిష్ఠాత్మక పురస్కారం ప్రదానం




**హైదరాబాద్, సెప్టెంబర్ 6 (పిసిడబ్ల్యూ న్యూస్):** వ్యాపార రంగంలో విశేష సేవలు అందిస్తూ, సుదీర్ఘకాలంగా తనదైన ముద్ర వేసుకున్న సంజయ్ వ్యాఘ్రు గారిని ప్రతిష్ఠాత్మక "భారత వ్యాపార రత్న" అవార్డుతో ఘనంగా సత్కరించారు. హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక రవీంద్రభారతి వేదికగా సెప్టెంబర్ 6న నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని RK కళా సంస్కృతిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వ్యాపార రంగంలో సంజయ్ వ్యాఘ్రు అందిస్తున్న సేవలు, ఆయన సుదీర్ఘ వ్యాపార ప్రస్థానం, నిరంతర కృషి, అంకితభావాన్ని గుర్తిస్తూ ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందజేశారు. ఆచార్య తిరునగరి వెంకటేశ్వర స్వామి ఆధ్వర్యంలో అవార్డు ప్రదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత సంజయ్ వ్యాఘ్రు మాట్లాడుతూ, తనకు లభించిన ఈ గౌరవం ఎంతో ఆనందాన్ని కలిగించిందని, అదే సమయంలో తనపై మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు. భవిష్యత్తులో కూడా వ్యాపార రంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగడంతో పాటు, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ తన వంతు సేవలు అందిస్తానని పేర్కొన్నారు. **సేవాభావానికి గుర్తింపుగా పురస్కారం** వ్యాపార రంగంలో కృషితో పాటు సామాజిక బాధ్యతను కూడా కొనసాగిస్తూ ముందుకు సాగుతున్న సంజయ్ వ్యాఘ్రు కి భారత వ్యాపార రత్న" అవార్డు లభించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. ఈ పురస్కారం ఆయన వ్యాపార ప్రస్థానానికి మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని కార్యక్రమ నిర్వాహకులు పేర్కొన్నారు.

# గణేష్ ఉత్సవ సమితి రామంతపూర్ డివిజన్ కన్వీనర్‌గా వార్ల బాల్ రాజ్ యాదవ్

### - వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో గణేష్ ఉత్సవాల నిర్వహణకు కృషి చేస్తాం



**ఉప్పల్ సెప్టెంబర్ 6(పిసిడబ్ల్యూ న్యూస్):** భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి రామంతపూర్ డివిజన్ కన్వీనర్‌గా వార్ల బాల్ రాజ్ యాదవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా సమితి పెద్దలు, నాయకులు ఆయనకు అభినందనలు తెలిపారు. రామంతపూర్ గణేష్ ఉత్సవ సమితి వ్యవస్థాపకులు తిండేరు హనుమంతరావు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉప్పల్ కన్వీనర్ ఏనుగు రాజిరెడ్డి, సెంట్రల్ కమిటీ సభ్యులు రమేష్, చింతకింది ప్రవీణ్ తదితరులు నూతన బాధ్యతలు స్వీకరించిన వారిని అభినందించారు. డివిజన్ పరిధిలో గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో, వైభవంగా నిర్వహించేందుకు సమితి నాయకులు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి అధ్యక్షుడు రుద్ర శేఖర్, మాలకొండ రెడ్డి, సోమ శ్రీనివాస్ గుప్త, రామేశ్వరరావు, ఓబుల్ రెడ్డి, చింతకింది ప్రవీణ్, చెల్లోజు ఎల్లాచారి, రాపోలు సాయినాథ్, కొండేరు స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# రంగరావుపల్లి సర్పంచ్‌కి "మణిరత్న" అవార్డ్ పురస్కారం

**గంగాధర సెప్టెంబర్ 6 ( పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో కొండ లక్ష్మణ్ బాపూజీ " మణిరత్న " అవార్డుల ప్రధానోత్సవం హనుమకొండలో నేతన్న టీవి మొదటి వార్షికోత్సవం మరియు స్వరాజ్ న్యూస్ ఆధ్వర్యంలో ఆదివారం రోజున పద్మశాలియులు వివిధ రంగాలలో ప్రతిభను కనబరిచిన విశిష్ట వ్యక్తులకు సన్మానించి వారికి కొండ లక్ష్మణ్ బాపూజీ "మణిరత్న" అవార్డులను ప్రధానం చేయడం జరిగింది. ఈ అవార్డులో భాగంగా గంగాధర మండలం రంగారావుపల్లి గ్రామ సర్పంచ్ దాసరి శంకరయ్య ను "మణిరత్న" అవార్డుతో సన్మానించి సత్కరించడమైనది. " మణిరత్న" అవార్డు పొందిన సర్పంచ్ దాసరి శంకరయ్య నేతన్న టీవీ స్వరాజ్ న్యూస్ వారికి పద్మశాలీలు అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.



# సీఎం రేవంత్ రెడ్డి పై విషప్రచారం - బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ ఫిర్యాదు


### కరీంనగర్ వన్ టౌన్ పీఎస్ లో ఫిర్యాదు చేసిన కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్

### సీఎం ఫోటో మార్ఫింగ్ చేసి దుష్ప్రచారం - BNS చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్

### బీఆర్ఎస్ నాయకుల తీరు శాంతి భద్రతలకు విఘాతం: అంజన్ కుమార్




**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 06(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న అసత్య, అవమానకర విష ప్రచారాన్ని ఖండిస్తూ, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ నేడు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఫోటోను అవమానకర రీతిలో మార్ఫింగ్ చేసి "ఓటుకు నోటు" అంటూ ఆయన వ్యక్తిత్వాన్ని కించపరిచే విధంగా కొందరు టిఆర్ఎస్ /బిఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియాలో మరియు బహిరంగంగా దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రజా పాలన అందిస్తున్న ముఖ్యమంత్రిని కనీసం ముఖ్యమంత్రిగా కూడా చూడకుండా అత్యంత నీచాతినీచంగా ప్రవర్తిస్తూ, ప్రజల్లో తప్పుడు సంకేతాలు పంపే ప్రయత్నం చేస్తున్నారు. ఇది పరువు నష్టం కలిగించే చర్య మాత్రమే కాకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. సమర్థవంతమైన పరిపాలనతో వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా అక్కసుతో ఓర్వలేక ఇలాంటి అసత్యపు ప్రచారాలు ఆరోపణలు చేస్తున్నారని బిఆర్ఎస్ నాయకులపై అంజన్ కుమార్ మండిపడ్డారు. ఈ అసత్య ప్రచారాన్ని సృష్టించిన, ప్రచారం చేస్తున్న టిఆర్ఎస్ /బిఆర్ఎస్ నాయకులపై మరియు ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన వారిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) చట్ట ప్రకారం కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు లేఖ ద్వారా కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్జీపిఎస్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మడుపు మోహన్, కార్పొరేటర్ వరాల నరసింగం, నగర కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షులు అహ్మద్ అలీ, నాయకులు షాహిద్, పెంట శేఖర్, మహమ్మద్ ఇమ్రాన్, మహాలక్ష్మి, వసీం, ఫహద్, మాజిద్ అలీ, నెల్లి నరేష్, అరుణ్ విలాసాగర్, ఆసిఫ్, మహేష్, శ్రీనివాస్, ఇమ్రాన్ ఘని, తదితరులు పాల్గొన్నారు.



తేదీ: 06-09-2026
స్థలం: కరీంనగర్

గౌరవనీయులైన సర్కిల్ ఇన్స్పెక్టర్ (CI) గారికి,
వన్ టౌన్ పోలీస్ స్టేషన్,
కరీంనగర్.

విషయం: గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఏ. రేవంత్ రెడ్డి గారిని అగౌరవపరిచే విధంగా, అసత్య ప్రచారం చేస్తున్న TRS/BRS నాయకులపై BNS చట్ట ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు.

ఆర్యా,

తెలంగాణ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ ఏ. రేవంత్ రెడ్డి గారి ఫోటోను అవమానకర రీతిలో మార్ఫింగ్ చేసి "ఓటుకు నోటు" అంటూ, ఆయన వ్యక్తిత్వాన్ని, గౌరవాన్ని కించపరిచే విధంగా కొంతమంది TRS/BRS పార్టీకి చెందిన నాయకులు సోషల్ మీడియాలో మరియు బహిరంగంగా దుష్ప్రచారం చేస్తున్నారు.

ప్రజా పాలన అందిస్తున్న గౌరవ ముఖ్యమంత్రి గారిని ముఖ్యమంత్రి అని కూడా చూడకుండా, అత్యంత నీచాతి నీచంగా, అగౌరవపరిచే విధంగా ప్రవర్తిస్తూ, ప్రజల్లో తప్పుడు సంకేతాలు పంపే ప్రయత్నం చేస్తున్నారు. ఇది పరువు నష్టం కలిగించే చర్య మాత్రమే కాకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఉంది.

కావున తమరు వెంటనే స్పందించి, ఈ అసత్య ప్రచారాన్ని సృష్టించిన, ప్రచారం చేస్తున్న TRS నాయకులపై మరియు ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన వారిపై భారతీయ న్యాయ సంహిత (BNS) చట్ట ప్రకారం కేసు నమోదు చేసి, కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నాము.

ఇట్లు,
భవదీయులు,
వైద్యుల అంజన్ కుమార్
అధ్యక్షులు, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ
26వ డివిజన్ కార్పొరేటర్, కరీంనగర్
సెల్: [మీ నంబర్ వేయండి]

# మల్లంపల్లి సమీపంలో మృతదేహం లభ్యం

### - కాజీపేట వాసిగా గుర్తింపు.. మృతిపై పోలీసుల దర్యాప్తు





**మల్లంపల్లి, సెప్టెంబర్ 6 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా మల్లంపల్లి మండల పరిధిలోని మహ్మద్ గౌస్‌పల్లిమల్లంపల్లి గ్రామాల మధ్య ఓ వ్యక్తి మృతదేహం లభ్యం కావడం స్థానికంగా కలకలం రేపింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. మృతుడిని హన్మకొండ జిల్లా కాజీపేటకు చెందిన లిముక్తార్ మహమ్మద్ (46)లిగా గుర్తించారు. సంఘటనా స్థలంలో లభించిన ఆధారాలు, ఇతర వివరాల ఆధారంగా పోలీసులు మృతుడి గుర్తింపును నిర్ధారించినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే ములుగు సబ్‌ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మృతుడు కాజీపేట నుంచి మల్లంపల్లి పరిసర ప్రాంతాలకు ఎలా వచ్చాడు? ఇక్కడికి రావడానికి గల కారణాలు ఏమిటి? ఆయన మృతి ప్రమాదవశాత్తూ జరిగిందా లేదా మరేదైనా కారణం ఉందా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ములుగు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా మృతికి అసలు కారణం వెల్లడయ్యే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ వెల్లడించారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

# పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం..





**రామడుగు, సెప్టెంబర్ 06( పి సి డబ్ల్యూ న్యూస్):** రామడుగు మండలంలోని ZPHS గుండి లో 2010-2011 బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు ఈ సందర్భంగా వారి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు చదువు చెప్పిన గురువులను గుర్తు చేసుకున్నారు అనంతరం పూర్వ విద్యార్థులు కర్ర వెంకటరాం రెడ్డి ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయునికి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి కేక్ కట్ చేశారు ఈ కార్యక్రమంలో కర్ర వెంకటరాం రెడ్డి,జైపాల్ రెడ్డి,చంద్రశేఖర్,జ్యోతి,కంప్యూటర్ టీచర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# మట్టి వినాయకుడిని పూజిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

- నగర మేయర్ కొలగాని శ్రీనివాస్
- ఆసరా ఫౌండేషన్ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహణ




**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 06 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన ఆసరా ఫౌండేషన్ (ఆపదలో సహాయానికి రా) ద్వితీయ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ రాపోలు గోపి కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, గత రెండు సంవత్సరాలుగా ఆసరా ఫౌండేషన్ నిర్వహిస్తున్న వివిధ సేవా కార్యక్రమాలను అభినందించారు. మొక్కలు నాటడం, పచ్చదనంపరిశుభ్రతపై అవగాహన కల్పించడం, ఓటరు అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, డ్రగ్స్ దుష్ప్రభావాలపై యువతకు అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ సంస్థ సమాజ సేవలో ముందుకు సాగడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా ఆపదలో ఉన్న వారికి రక్తదానం ద్వారా సహాయం అందించడంలో ఆసరా ఫౌండేషన్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని మేయర్ కొనియాడారు. సేవా కార్యక్రమాలను ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. **మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని కాపాడాలి**రాబోయే వినాయక చవితి పండుగను పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఆసరా ఫౌండేషన్ రూపొందించిన "మట్టి వినాయకుడిని పూజిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" వాల్ పోస్టర్‌ను మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగర ప్రజలందరూ వినాయక చవితి సందర్భంగా మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. మట్టి వినాయక విగ్రహాలు నీటిలో సులభంగా కలిసిపోతాయని, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలతో పోలిస్తే పర్యావరణంపై ప్రతికూల ప్రభావం తక్కువగా ఉంటుందని తెలిపారు. సాధ్యమైనంత వరకు ఇంటివద్దనే మట్టి వినాయక విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేసుకుని, అనంతరం ఆ మట్టిని పూల మొక్కలు, మొక్కల పెంపకానికి వినియోగించుకోవచ్చునిలిప్రజలకు సూచించారు. వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, "మట్టి వినాయకుడు పర్యావరణానికి మేలు" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ప్రజల్లోకి తీసుకెళ్లాలని మేయర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆసరా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఆర్. గోపి కృష్ణ, సంస్థ సభ్యులు కె. ప్రవీణ్, జి. తిరుపతి, ఎం. రవి చందర్, వి. అద్వైత్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు గుర్తుర్ నుండి ఏఎంసికి నూతన ఆర్టీసీ బస్ సర్వీస్ ప్రారంభం

- గ్రామ సర్పంచ్ విసంపల్లి కవితా బాలకృష్ణ వెల్లడి






**తొర్రూరు ప్రతినిధి, సెప్టెంబర్ 6(పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాదు కు వెళ్లే మార్గంలో గల నూతనంగా ప్రారంభించిన ఏఎంసి ఆసుపత్రి పేదలకు అతి తక్కువ రుసుముతో ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. పెద్ద జబ్బుతో బాధపడే పేదరికం అనుభవించే సామాన్య మానవులకు అందుబాటులో ఉండే విధంగా ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేసినందుకు తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుండి ఎంతోమంది రోగులు వైద్య పరీక్షలు నిర్వహించుకునేందుకు తరలి వెళ్తున్నారు. మారుమూల గ్రామాల నుండి ఏఎంసీ కి వెళ్లేందుకు సరైన బస్సు సౌకర్యాలు లేకపోవడంతో గ్రామాలలో జబ్బున పడిన బాధితులు ఆసుపత్రికి వెళ్లేందుకు సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో మహబూబాద్ జిల్లా తొర్రూరు మండలం గుర్తుర్ గ్రామ సర్పంచ్ కవితా బాలకృష్ణ, వీరితోపాటు గట్టికల్లు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కాసినాదం మారుమూల పల్లె ప్రాంతాలను కలుపుతూ ఎఎంసికి బస్సు సౌకర్యాలను ఏర్పాటు చేయాలని పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే యశస్విని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే గ్రామాలలో ఉండే పేద ప్రజల కొరకు ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేయాలని సంకల్పంతో మహబూబాబాద్ డిపో మేనేజర్ తో మాట్లాడి నూతన ఆర్టీసీ సర్వీసును ఏర్పాటు చేశారు. వ్యాధిగ్రస్తుల కోరిక మేరకు అడిగిన వెంటనే స్పందించి బస్సును ఏర్పాటుచేసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి అన్ని గ్రామాల తరఫున సర్పంచ్ కవితా బాలకృష్ణ తో పాటు గట్టికల్లు మాజీ సర్పంచ్ కాసినాదం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మహబూబాబాద్ నుండి ఉదయం 4.00 గంటలకు ఎక్స్ప్రెస్ బస్సు(ఆధార్ కార్డు చెల్లుబాటు అవుతుంది) బయలుదేరి నెల్లికుదురు, మడిపల్లి, కంటాయపాలెం మార్గం ద్వారా గుర్తుర్ కు ఉదయం 5.30చేరుకుంటుంది ఇక్కడి నుండి ఉకళ్ళు, గట్టి కళు ్ళ, రాయపర్తి, వర్ధన్నపేట, జఫర్గడ్, జనగాం, భువనగిరి మార్గం ద్వారా ఏఎంసికి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఇదే మార్గం ద్వారా మహబూబాబాద్ డిపోకు ప్రతినిత్యం బస్సులు నడిచే విధంగా ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచులు ఏర్పాటుచేసిన ఈ బస్సు సర్వీసును ప్రతి గ్రామస్తులు వైద్య పరీక్షలకు వెళ్లేందుకు మంచి సదుపాయాన్ని కల్పించిన అడిగిన వెంటనే కాదనకుండా నిరుపేదల కోసం ఏర్పాటుచేసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట నిలబెట్టేందుకు ప్రతి ఒక్కరూ అనారోగ్యంతో బాధపడేవారు ఈ బస్సును సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గుర్తుర్ నుండి వరంగల్ వెళ్లవలసిన ప్రయాణికులకు హైదరాబాదుకు వెళ్లవలసిన ప్రయాణికులకు ఈ గ్రామం నుండి ఉదయాన్నే వెళ్లేందుకు ఉదయం 7.00 గంటల వరకు ఎలాంటి బస్సు సౌకర్యం లేకపోవడం ఇన్ని రోజుల నుండి ఎన్నో బాధలు పడుతూ తొర్రూరు చేరుకునేవారు. ఇప్పుడు అలాంటి అవసరం లేకుండా ఉదయాన్నే వెళ్లే ఈ బస్సును అందరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ కోరారు.

# సరస్వతీ శిశు మందిర్‌లో ఘనంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు













**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 06(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్‌లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ హైస్కూల్ లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలతో, కన్నుల పండుగగా సాగాయి. పాఠశాల విద్యార్థులు, చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ మరియు గోపికల సాంప్రదాయ వేషధారణలతో అలరించారు. వారి ముద్దులొలికే రూపాలు, రంగురంగుల దుస్తులు పాఠశాల ప్రాంగణానికి సరికొత్త పండుగ శోభను తీసుకువచ్చాయి. విద్యార్థులు శ్రీకృష్ణుని లీలలు, జీవిత విశేషాలను ప్రతిబింబించేలా భక్తిపాటలకు నృత్యాలు, కోలాటాలు చేస్తూ వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నారు. వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచిన ఉట్టి కొట్టే పోటీలో చిన్నారులు ఎంతో ఉత్సాహంగా, కేరింతలు కొడుతూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానాచార్యులు మోర రణధీర్ మాట్లాడుతూ శ్రీకృష్ణుని జన్మాష్టమి విశిష్టతను వివరించారు. ప్రతి ఒక్కరూ భగవానుని బోధనలను, సత్య మార్గాన్ని అనుసరిస్తూ జీవితంలో ఉత్తమ విలువలను పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. చిన్నారుల సందడి, భజనల కోలాహలంతో సరస్వతీ శిశు మందిర్ ఆవరణం అంతా ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ కోల అన్నారెడ్డి, ఎలగందుల సత్యనారాయణ, కొత్తూరి ముకుందం, కడార్ల సూర్యనారాయణ, గట్టు శ్రీనివాస్, రాపర్తి శ్రీనివాస్, తాటి రాజేశ్వర్ రావు, కోట లక్ష్మారెడ్డి, పులల శ్యామ్, ఎలగందుల శ్రీనివాస్, అప్పిడి వకుళాదేవి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఆర్ఆర్ కళాశాల ఆవరణలో మినీ చెక్ డ్యామ్ మత్తడి ఆధునికీకరణ పనుల పరిశీలన



**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 06 (పిసిడబ్ల్యూ న్యూస్):** రూ.3.5 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో పనులులీకేజీల సమస్యకు శాశ్వత పరిష్కారం బతుకమ్మ వేడుకలకు 45 డివిజన్ల ప్రజలకు అందుబాటులోకి నగరంలోని ఎస్ఆర్ఆర్ కళాశాల ఆవరణలో రూ.3.5 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపడుతున్న మినీ చెక్ డ్యామ్ మత్తడి ఆధునికీకరణ పనులను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పరిశీలించారు. ఇదివరకు మినీ చెక్ డ్యామ్ మత్తడికి లీకేజీలు ఉండడంతో నీరు నిల్వ ఉండకపోవడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానిక కార్పొరేటర్ బండ రమణారెడ్డి మేయర్ కొలగాని శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను పరిశీలించిన మేయర్, ప్రజలకు శాశ్వత పరిష్కారం కల్పించాలనే ఉద్దేశంతో మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.3.5 లక్షలు కేటాయించి మత్తడి మరమ్మతులు, ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, మత్తడి ఆధునికీకరణ పనులు పూర్తయిన తర్వాత మినీ చెక్ డ్యామ్‌లో నీరు నిల్వ ఉండేలా చేయడంతో పాటు వర్షపు నీటిని సమర్థవంతంగా వినియోగించుకునే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. దీనివల్ల చైతన్యపురి మరియు పరిసర కాలనీల్లో భూగర్భ జలమట్టం పెరగడానికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. అలాగే బతుకమ్మ పండుగ సందర్భంగా నాలుగు నుంచి ఐదు డివిజన్లకు చెందిన మహిళలు, ప్రజలు బతుకమ్మ వేడుకలు నిర్వహించుకునేందుకు ఈ ప్రాంతం అందుబాటులోకి వస్తుందని మేయర్ తెలిపారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు పండుగ వేడుకలకు అనువైన ప్రదేశంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. మత్తడి ఆధునికీకరణ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని, పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా బతుకమ్మ పండుగకు ముందే పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను మేయర్ ఆదేశించారు. నగరంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులతో పాటు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. స్థానిక ప్రజల సమస్యలను గుర్తించి, కార్పొరేటర్ల సూచనలను పరిగణనలోకి తీసుకుని అవసరమైన నిధులు కేటాయిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని మేయర్ పేర్కొన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బండ రమణారెడ్డితో పాటు కార్పొరేటర్లు బోయినపల్లి ప్రవీణ్ రావు, మాసం గణేష్, గాదె శివరావు, కర్రి అనిల్, ఎన్నం ప్రకాష్, అధికారులు ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ తవ్వకాలపై సీనియర్ టీడీపీ నేతల ఆగ్రహం

**కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్**

**జేసీబీలతో తవ్వకాలు, టిప్పర్లతో తరలింపు**

**ఇసుక మాఫియాపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి: టీడీపీ నేతలు**



**సిద్ధవటం,సెప్టెంబర్ 6(పిసిడబ్ల్యూ న్యూస్):** పెన్నా, చెయ్యేరు నదీ పరివాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా యథేచ్ఛగా సాగుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని టీడీపీ సీనియర్ నేతలు ఆరోపించారు. జిల్లా కలెక్టర్ నదీ పరివాహక ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలను నిషేధించినప్పటికీ, అక్రమంగా జేసీబీలతో ఇసుక తవ్వి టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని మండిపడ్డారు. భాకరాపేటలో ఆదివారం టీడీపీ సీనియర్ నేత, మాజీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు పుత్తా రామచంద్రయ్య నివాసంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర మాజీ కల్లుగీత కార్పొరేషన్ డైరెక్టర్ కొమర వెంకట నరసయ్య మాట్లాడారు. పెద్ద యంత్రాలతో ఇసుక తవ్వకాలు జరపడం వల్ల పెన్నా నదిలో భారీ గుంతలు ఏర్పడుతున్నాయని, అక్రమ రవాణాతో ఇసుక మాఫియా కోట్లాది రూపాయలు ఆర్జిస్తోందని ఆరోపించారు. గృహ నిర్మాణ అవసరాలకు మాత్రమే ఉచితంగా ఇసుక వినియోగించుకునే అవకాశం ఉన్నప్పటికీ, పెద్ద టిప్పర్ల ద్వారా ఇసుకను దూర ప్రాంతాలకు తరలిస్తున్నారని తెలిపారు. అక్రమ ఇసుక రవాణా కారణంగా గ్రామీణ రహదారులు దెబ్బతిని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. చెయ్యేరు నదీ తీరంలో అక్రమ ఇసుక రవాణా వాహనాలను అధికారులు పట్టుకుని భారీగా జరిమానాలు విధించినా, మళ్లీ అదే తరహాలో అక్రమ రవాణా కొనసాగుతోందని విమర్శించారు. రాజంపేట నియోజకవర్గంలో ఇసుక అక్రమాలపై పలు పత్రికల్లో వరుస కథనాలు వస్తున్నా మైనింగ్, రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం విచారకరమన్నారు. అధికార పార్టీకి చెందినవారిగా ఉన్నప్పటికీ అక్రమాలను అరికట్టలేకపోతున్నామని, ప్రభుత్వం వచ్చిన తర్వాత పార్టీలో చేరిన కొందరి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని అధిష్ఠానాన్ని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీని సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో టీడీపీ సీనియర్ నేత పుత్తా రామచంద్రయ్య, కొమర వెంకట నరసయ్య, అసెంబ్లీ అధికార ప్రతినిధి రామ్మోహన్ నాయుడు, కిరణ్ స్వామి, సుబ్రహ్మణ్యం, కొండా శ్రీనివాసులు, డాక్టర్ శివ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా ముల్కల మల్లేశం..





**హైదరాబాద్ సెప్టెంబర్ 06(పిసిడబ్ల్యూ న్యూస్):** ఈరోజు హైదరాబాదులోని గాంధీభవన్ లో జరిగినటువంటి రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ కార్యవర్గ సమావేశంలో కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం గుండ్లపల్లి గ్రామానికి చెందిన ముల్కల మల్లేశం ను ఎస్సీ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ గా నియమిస్తూ టిపిసిసి ఎస్ సి సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఉత్తర్వులు విడుదల చేశారు.తన నియామకం పట్ల ముల్కల మల్లేశం మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మన్, మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకి, జిల్లా అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్ కి ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో ఎస్సీ వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడతానని, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేసి, పార్టీ అభివృద్ధికి పాటుపడతానని తెలియజేశారు.

# మోదీ జన్మదినం సందర్భంగా 'సేవా సంకల్ప్ అభియాన్'ను విజయవంతం చేయండి

**• భాజపా జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్**



**పులివెందుల సెప్టెంబర్ 6(పిసిడబ్ల్యూ న్యూస్): –** దేశాన్ని అన్ని రంగాల్లో ప్రగతి పథం వైపు నడిపిస్తూ 'వికసిత భారత్' లక్ష్యంగా సుపరిపాలన అందిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 17 నుంచి నిర్వహించనున్న 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమాలను విజయవంతం చేయాలని భాజపా జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ పిలుపునిచ్చారు.పులివెందుల భాజపా కార్యాలయంలో మండల శాఖ అధ్యక్షుడు నవీన్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.నరేంద్ర మోదీ 12 ఏళ్లు ముఖ్యమంత్రిగా,దాదాపు దశాబ్దానికి పైగా దేశ ప్రధానిగా నిస్వార్థ ప్రజాసేవ అందిస్తున్నారని కొనియాడారు.దేశ రక్షణ, సార్వభౌమాధికారాన్ని పటిష్ఠం చేస్తూ విప్లవాత్మక సంస్కరణలు చేపట్టారని,ప్రపంచ యవనికపై భారత్‌ను 'విశ్వగురువు'గా నిలిపేందుకు ప్రధాని అహర్నిశలు శ్రమిస్తున్నారని పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తోందని,పోలవరానికి నిధుల తోడ్పాటుతో పాటు అమరావతి రాజధాని అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించారని తెలిపారు. రాష్ట్రాన్ని విద్యుత్ రంగంలో మిగులు సాధించే దిశగా కేంద్రం ప్రోత్సహిస్తోందని చెప్పారు.రాష్ట్ర సమగ్ర ప్రగతి కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముందుచూపుతో కేంద్రంతో కలిసి సమన్వయంతో సాగిస్తున్న పాలన ప్రశంసనీయమని అన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్,బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు వాజపేయి,ఓబీసీ మోర్చా నాయకుడు యుగంధర్,స్థానిక నాయకులు లక్ష్మయ్య,కోడిమూర్తి శ్రీరాములు,తిరుపాల్ రెడ్డి,రక్షిత్ చౌదరి,సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఒగ్గు బీర్ల సంఘం కొరకు ఎమ్మెల్యేకు వినతి..



**రామడుగు సెప్టెంబర్ 6(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా రామడుగు మండల ఒగ్గు బిర్లా సంక్షేమ సంఘం కళాకారులందరూ కరీంనగర్ జిల్లా ఒగ్గు బీర్ల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఒగ్గరి రాజు మరియు రామడుగు ఒగ్గు బిర్లా సంక్షేమ సంఘం అధ్యక్షులు సాయిల రాగుల మల్లయ్య ఆధ్వర్యంలో రామడుగు మండల ఒగ్గు బీర్ల కళాకారులు చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం సన్మానించి రామడుగు ఒగ్గు బీర్ల సంక్షేమ సంఘం స్థలం మరియు సంఘ భవన నిర్మాణం గురించి వినతిపత్రం అందజేయడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో ఒగ్గు బిర్లా కళాకారులు పాల్గొనడం జరిగింది.

# జనసేనలో రవిశంకర్‌కు కీలక బాధ్యత

**కడప పార్లమెంట్ సహాయక బృందం సభ్యుడిగా నియామకం**



**వేంపల్లె సెప్టెంబర్ 6(పిసిడబ్ల్యూ న్యూస్):** జనసేన పార్టీలో వేంపల్లె పట్టణానికి చెందిన దాసరి రవిశంకర్‌కు కీలక బాధ్యతలు అప్పగించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయడంలో భాగంగా జనసేన పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కడప, రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గాలకు సమన్వయ కమిటీలను నియమించారు. ఇందులో భాగంగా కడప పార్లమెంట్ సహాయక బృందం సభ్యుడిగా పులివెందుల నియోజకవర్గం వేంపల్లెకు చెందిన దాసరి రవిశంకర్‌ను నియమించారు.ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ తనకు ఈ బాధ్యతలు అప్పగించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళలను సమన్వయం చేయడంతో పాటు కూటమి భాగస్వామ్య పక్షాలతో క్షేత్రస్థాయిలో సమన్వయం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.పార్టీ అధిష్ఠానం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని రవిశంకర్ పేర్కొన్నారు. కడప పార్లమెంట్ పరిధిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుని ఎన్నికలకు సన్నద్ధం చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. నియమిత సభ్యులకు ఈ నెల 9న ఉదయం 10 గంటలకు మంగళగిరిలో ప్రత్యేక శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు రవిశంకర్ వెల్లడించారు.

# రాయచోటిలో ఘర్షణ ఘటనపై ఇరువర్గాలపై కేసులు

**• నలుగురికి కౌన్సెలింగ్ • చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు**

**రాయచోటి సెప్టెంబర్ 6(పిసిడబ్ల్యూ న్యూస్):** రాయచోటి పట్టణంలోని కొత్తపల్లి ప్రాంతంలో మోటార్‌సైకిల్ దగ్ధం ఘటనపై తలెత్తిన వివాదం అనంతరం బస్టాండ్ వద్ద జరిగిన ఘర్షణకు సంబంధించి ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి.వి. చలపతి తెలిపారు.ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని, సంబంధిత నలుగురు వ్యక్తులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా గొడవలకు పాల్పడినా, చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వివాదాలు తలెత్తినప్పుడు ప్రజలు స్వయంగా ఘర్షణలకు దిగకుండా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.

# డిగ్రీ ప్రవేశాల జాప్యాన్ని నివారించాలి

**తరగతులు వెంటనే ప్రారంభించాలి: పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న**

**కడప సెప్టెంబర్ 6(పిసిడబ్ల్యూ న్యూస్):** డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియలో జరుగుతున్న జాప్యాన్ని నివారించి, విద్యార్థుల విద్యా సంవత్సరం నష్టపోకుండా వెంటనే తరగతులు ప్రారంభించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కడపలోని పీడీఎస్‌యూ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ఫలితాలు వెలువడి నాలుగు నెలలు గడిచినా డిగ్రీ ప్రవేశాలు పూర్తికాకపోవడంతో వేలాది మంది విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారని తెలిపారు. వెంటనే కౌన్సెలింగ్ పూర్తి చేసి పారదర్శకంగా సీట్ల కేటాయింపు చేపట్టాలని కోరారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఖాళీ అధ్యాపక పోస్టులను భర్తీ చేసి, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే విద్యార్థుల హక్కుల కోసం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కడప, అన్నమయ్య జిల్లాల నాయకులు మనోజ్, మహేష్, పండు తదితరులు పాల్గొన్నారు.

# వేల్పులలో ఘనంగా రాము జన్మదిన సంబరాలు..

**తల్లి లింగాల పార్వతమ్మ చేతుల మీదుగా కేక్ కట్..**

**రాముపై ప్రత్యేకంగా రూపొందించిన పాట విడుదల**

**పెద్ద సంఖ్యలో పాల్గొన్న యువత,అభిమానులు**



**వేముల సెప్టెంబర్ 6(పిసిడబ్ల్యూ న్యూస్): –**వేముల మండలం వేల్పుల గ్రామంలో వైఎస్సార్‌సీపీ వేముల మండల పరిశీలకుడు వేల్పుల రాము జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. అభిమానులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, యువత, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.వేడుకల్లో భాగంగా రాము తల్లి లింగాల పార్వతమ్మ అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అభిమానులు రాముకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ..ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు.పుట్టినరోజు వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా వేల్పుల రాముపై రూపొందించిన ప్రత్యేక పాటను లింగాల పార్వతమ్మ ఆవిష్కరించారు.రాము వ్యక్తిత్వం, ప్రజలతో ఆయనకున్న అనుబంధాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన ఈ పాటను వేడుకల్లో విడుదల చేశారు. పాట ఆవిష్కరణ సందర్భంగా అభిమానులు,యువత ఉత్సాహంగా స్పందించారు.ఈ సందర్భంగా అభిమానులు మాట్లాడుతూ.. రాము ప్రజలతో మమేకమై, గ్రామస్తులతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తూ అందరి ఆదరణ పొందుతున్నారని తెలిపారు.రాజకీయంగా మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, ఎంపీటీసీ బాబ్జాన్,నాయకులు,అభిమానులు,యువత, గ్రామస్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# నిరుపేద యువతి వివాహానికి ఎఐహెచ్‌ఆర్ పిసి సేవా కార్యక్రమం

**పులివెందుల, సెప్టెంబర్ 6(పిసిడబ్ల్యూ న్యూస్):** నిరుపేద యువతి వివాహం సందర్భంగా అల్ ఇండియా హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ (ఎఐహెచ్‌ఆర్ పిసి ) ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ వరప్రసాద్, విలేకరి రమేష్ పాల్గొన్నారు. వారు వివాహానికి హాజరైన పెళ్లికొడుకు, పెళ్లికూతురు కుటుంబ సభ్యులు, బంధువులు, అతిథులకు స్వయంగా బిర్యానీ వడ్డించి సేవలందించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి అండగా నిలిచి సేవా కార్యక్రమాన్ని నిర్వహించిన ఎఐహెచ్‌ఆర్ పిసి నిర్వాహకులు, సభ్యులను అభినందించారు. సమాజ సేవలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు.ఎఐహెచ్‌ఆర్ పిసి నేషనల్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్ పీరా, రాష్ట్ర ఎడ్యుకేషన్ అండ్ హెల్త్ సెల్ ప్రతినిధి షేక్ మహమ్మద్ అక్రం హుస్సేన్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ షేక్ మాబు సుభాన్, కడప జిల్లా చైర్మన్ షేక్ మహమ్మద్ నజీర్, రాష్ట్ర యాంటీ కరప్షన్ సెల్ ఇన్‌చార్జ్ షేక్ మహమ్మద్ షకీర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ సభ్యులు షాహుల్, షరీఫ్, సతీష్, వంశీ, రాకేష్, కృతిక్, జ్ఞాని, రక్షిత్, లోకేష్ తదితరులు పాల్గొని సేవలందించారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

ప్రదీప్ రంగనాథన్ నటించిన 'డ్రాగన్' చిత్రంతో హీరోయిన్ కయాదు లోహర్ మంచి గుర్తింపు తెచ్చుకుంది. అంతకు ముందుకు ఈ అమ్మడు తెలుగులో అల్లూరి అనే సినిమా చేసింది. కానీ ఆ సినిమా పెద్దగా ఆకట్టుకుకోలేదు. ఇక ఈ చిన్నది ఫంకీ సినిమాతో మరోసారి తెలుగు ఆడియన్స్ ను ఆకట్టుకుంది. కానీ ఈ సినిమా అంతగా ఆకట్టుకోలేదు. ప్రస్తుతం ఆమె తమిళం, తెలుగు చిత్రసీమలలో చాలా బిజీగా ఉంది. సోషల్ మీడియాలోనూ ఈ ముద్దుగుమ్మ చాలా యాక్టివ్ గా ఉంటుంది. మరోవైపు తెలుగులోనూ బ్యాక్ టూ బ్యాక్ అవకాశాలు అందుకుంటుంది. ప్రస్తుతం నేచురల్ స్టార్ నాని నటిస్తున్న ది ప్యారడైజ్ సినిమాలో కాయదు హీరోయిన్ గా నటిస్తుంది. ఇదిలా ఉంటే తాజాగా కయాదు లోహర్ చేసిన కొన్ని కామెంట్స్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. సినిమాల్లో ఆడవాళ్లను చూపించే విధానంపై కయాదు లోహర్ ఆసక్తికర కామెంట్స్ చేశారు.సినిమాల్లో మహిళలను కేవలం ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించే ఐటెమ్ లా చూపించే ధోరణిని తాను ఒప్పుకోనని తేల్చి చెప్పింది కాయదు. స్పష్టం చేశారు యంగ్ హీరోయిన్ కయాదు లోహర్. కథ, పాత్ర డిమాండ్ చేస్తే పరిమితులకు లోబడి నటించడానికి ఎలాంటి అభ్యంతరం లేదని, కేవలం లైమ్ లైట్ కోసమో లేదా సోషల్ మీడియాలో ట్రెండ్ అవ్వడానికో అసభ్యకరమైన సన్నివేశాల్లో నటించే ఆలోచన తనకు అస్సలు లేదని చెప్పుకొచ్చింది కయాదు లోహర్. ఈ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.అస్సాంలహీరోయిన్ కయాదు లోహర్. కథ, పాత్ర డిమాండ్ చేస్తే పరిమితులకు లోబడి నటించడానికి ఎలాంటి అభ్యంతరం లేదని, కేవలం లైమ్ లైట్ కోసమో లేదా సోషల్ లో పుట్టి పెరిగినా దక్షిణాది సినిమా ఇండస్ట్రీలో సత్తా చాటుతోంది కాయదు లోహర్. తన అందం, అభినయంతో కుర్రకారులో క్రేజ్ తెచ్చుకుందీ ముద్దుగుమ్మ. మోడలింగ్ తో కెరీర్ మొదలు పెట్టిన కాయదు లోహర్. 'టైమ్స్ ఫ్రెష్ ఫేస్' పోటీల్లో విజేతగా నిలిచి అందరి దృష్టినీ ఆకర్షించిన కయాదు ఆ తర్వాత నటనారంగం వైపు అడుగులు వేశారు. కన్నడలో 'ముగిల్‌పేటే' చిత్రంతో కెరీర్ ప్రారంభించింది ఈ ముద్దుగుమ్మ ..

## ఆడపిల్లలంటే ఆట వస్తువులు కాదు.. అలా చూపిస్తే ఒప్పుకోను

**కయాదు లోహర్**



టాలీవుడ్ ఇండస్ట్రీలో మోస్ట్ అవైటెడ్ ఫిల్మ్ ది ప్యారడైజ్. న్యాచురల్ స్టార్ నాని హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా మూవీ ఇది. దసరా సినిమాతో బాక్సాఫీస్ షేక్ చేసిన డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన ఆయా షేర్ సాంగ్ నెట్టింట సంచలనం సృష్టించింది. ఇక ఇటీవల విడుదలైన ఏశనాగుల సాంగ్ ఇప్పుడు యూట్యూబ్ ను ఊపేస్తుంది. ఈ పాటకు మాస్ అడియన్స్ ఎక్కువగా కనెక్ట్ అయ్యారు. ప్రస్తుతం ఈ మూవీ సాంగ్ మిలియన్ వ్యూస్ తో దూసుకుపోతుంది. ఇదిలా ఉంటే ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా విడుదల తేదీకి సంబంధించి సోషల్ మీడియాలో పలు పుకార్లు ప్రచారంలోకి రావడంతో, మేకర్స్ రిలీజ్ డేట్‌పై మరోసారి స్పష్టతనిచ్చారు.

## నాని ది ప్యారడైజ్ మూవీ రిలీజ్ డేట్ ఇదే.. మరోసారి క్లారిటీ ఇచ్చిన మేకర్స్..




సరిగ్గా మునుపటి ప్రకటన ప్రకారమే ఈ చిత్రం సెప్టెంబర్ 24, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుందని చిత్ర బృందం స్పష్టం చేసింది.'దసరా' వంటి భారీ బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత నాని -- శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్లో వస్తున్న రెండో సినిమా కావడంతో 'ది ప్యారడైజ్' పై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఈ చిత్రంలో నాని మునుపెన్నడూ చూడని సరికొత్త, రగ్గడ్ మాస్ అవతార్‌లో కనిపించనున్నారు. ఈ సినిమాలో కలెక్షన్ కింగ్ మోహన్ బాబు పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తుండగా, రాఘవ్ జుయాల్, సోనాలి కులకర్ణి, తనికెళ్ల భరణి, బాబు మోహన్, సంపూర్ణేష్ బాబు తదితరులు ముఖ్య పాత్రల్లో కనిపిస్తారు. అంతేకాకుండా, నటి కీర్తి సురేష్, నాని నటించిన ఏశనాగుల సాంగ్ దుమ్మురేపుతుంది.తాజాగా ది ప్యారడైజ్ మేకర్స్ అభిమానులకు గుడ్ న్యూస్ చెప్పారు. నాని సినీ ప్రయాణం 18 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఈ చిత్రానికి సంబంధించిన బిగ్ అప్డేట్ ఇచ్చారు. ఈ మూవీ రిలీజ్ తేదీపై ఎలాంటి సందేహాలు అక్కర్లేదని స్పష్టం చేశారు. ముందుగా ప్రకటించిన తేదీ సెప్టెంబర్ 24న థియేటర్లలో తీసుకురానున్నట్లు ఓ వీడియోను షేర్ చేశారు. దీంతో ఈ మూవీ రిలీజ్ విషయంలో క్లారిటీ వచ్చింది.

## ఆ రోజు షూటింగ్ లో ఒక్కరు కూడా నన్ను పేరుపెట్టి పిలవలేదు.



ప్రముఖ నటుడు సాయి కుమార్ తన సినీ ప్రస్థానాన్ని, అగ్రతారలు అలాగే దిగ్గజ దర్శకులతో తనకున్న అనుబంధాన్ని వివరించారు. ముఖ్యంగా సూపర్ స్టార్ కృష్ణ గారితో తన తండ్రికి ఉన్న సంబంధాన్ని, తానూ కృష్ణ గారితో కలిసి పనిచేసిన మధురానుభూతులను పంచుకున్నారు. తన తండ్రి, కృష్ణ గారు, శోభన్ బాబు గారు వంటి వారు దాదాపు ఒకే సమయంలో సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టారని సాయి కుమార్ వెల్లడించారు. తన తండ్రి ఎన్నో చిత్రాలకు డబ్బింగ్ చెప్పేవారని, కృష్ణ గారు కూడా ఆయనతో అనేక మంచి పాత్రలు చేయించారని స్మరించుకున్నారు. కృష్ణ గారు నటించిన విజయవంతమైన చిత్రం గూఢచారి 116లో తన తండ్రి ఫైట్లు చేశారని, ఆ సినిమా పెద్ద హిట్‌గా నిలిచిందని పేర్కొన్నారు.తన సినీ జీవితం ప్రారంభంలో డబ్బింగ్‌లు చెప్పడంతో పాటు, నటుడిగా కూడా అవకాశాలు వెతుక్కున్నానని సాయి కుమార్ తెలిపారు. మురళీ మోహన్ రావు గారి దర్శకత్వంలో ఒక చిత్రంలో హోటల్ రిసెప్షనిస్ట్‌గా నటించానని, అది మంచి సినిమా అని గుర్తుచేసుకున్నారు. ఆ తరువాత, ఒక రోజు దర్శకుడు గోపాల్ గారు ఫోన్ చేసి అగ్ని పర్వతం చిత్రంలో విజయశాంతి గారి భర్త పాత్ర ఉందని, చేస్తావా అని అడిగారని తెలిపారు. వెంటనే అంగీకరించి షూటింగ్ కు వెళ్లగా, లొకేషన్‌లో ఎవరూ తనను పేరుతో పిలవకుండా "పెళ్లి కొడుకు" అని మాత్రమే పిలిచారని, ఇది తనకు ఆశ్చర్యం కలిగించిందని సరదాగా చెప్పారు. దర్శకులు రాఘవేంద్ర రావు గారు కూడా "పెళ్లి కొడుకుని రమ్మనయ్యా" అని చెప్పారని, కృష్ణ గారు వచ్చేలోపు తన షాట్లు తీయడానికి ప్రయత్నించారని వివరించారు. ఫ్రేమ్‌లోకి తను వచ్చినప్పుడు, "నువ్వేంట్రా?" అని కృష్ణ గారు అనగా, "వేషం వేషం అని నేను ఎప్పటినుంచో అడుగుతున్నాను" అని చెప్పానని అన్నారు.అప్పుడు కృష్ణ గారు గోపాల్ గారిని పిలిచి, పరుచూరి బ్రదర్స్ ను పిలిపించి, మంచి డైలాగ్స్ రాయించి, తనను సినిమాలో కొనసాగించారని సాయి కుమార్ ఆ సంఘటనను గుర్తు చేసుకున్నారు. అగ్ని పర్వతం ఒక సూపర్ హిట్ సినిమా అని తెలిపారు. తాను ముప్పలనేని శివ దర్శకత్వంలో కూడా ఒక సినిమాలో నటించానని, అలాగే ప్రముఖ నటి, దర్శకురాలు విజయనిర్మల గారి దగ్గర కూడా మంచి సినిమాలు చేశానని, ఆమె దర్శకత్వంలో పిన్ని వంటి కొన్ని మంచి చిత్రాలలో నటించానని సాయి కుమార్ పేర్కొన్నారు. శోభన్ బాబు గారితో కూడా తన సినీ ప్రస్థానంలో అనేక చిత్రాలలో నటించానని, ముఖ్యంగా పరువు ప్రతిష్ట, దోషి నిర్దోషి



మాస్ మహరాజా రవితేజ– శివ నిర్వాణ కాంబినేషన్ లో వచ్చిన లేటెస్ట్ సినిమా 'ఇరుముడి'. తండ్రి, కూతుళ్ల సెంటిమెంట్ తో తెరకెక్కిన ఈ సినిమా సంచలన విజయం సాధించింది. ఆగస్టు 21న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఇరుముడి సినిమా ఇప్పటికే రూ. 200 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించింది. రిలీజై మూడు వారాలు గడుస్తున్నా ఈ సినిమా హౌస్ ఫుల్ కలెక్షన్లతో ఆడుతుండడం విశేషం. చాలా చోట్ల ట్రాక్టర్లతో వెళ్లి మరీ థియేటర్లలో ఈ సినిమాను చూస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఇరుముడి సినిమాను నిర్మించారు. రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటించింది. అలాగే సాయికుమార్, అజయ్ ఘోష్, రమేష్ ఇందిర, స్వాసిక కీలక పాత్రలు పోషించారు. ఇక ఈ సినిమాలో రవితేజ కూతురిగా నటించిన నక్షత్ర ఈ సినిమాను నెక్స్ట్ లెవెల్ కు తీసుకెళ్లింది. అలాగే కోలీవుడ్ స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాశ్ కుమార్ అందించిన ఈ పాటలు సినిమా విజయంలో కీలక పాత్రలు పోషించాయి.ఇదిలా ఉంటే ఇరుముడి సినిమా నుంచి తాజాగా మరో సాంగ్ రిలీజ్ చేశారు మేకర్స్. కార్తీకమాసం ఫుల్ వీడియో పాటను ఇరుముడి టీమ్ విడుదల చేసింది. ఈ పాటకు డైరెక్టర్ శివ నిర్వాణ లిరిక్స్ అందించడం విశేషం. అలాగే మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాశ్ కుమార్ పాడడంతో పాటు కంపోజ్ చేశారు. అయ్యప్ప స్వామి భక్తి దీక్ష విశిష్టతను, ఆధ్యాత్మిక పరివర్తనను అత్యంత హృద్యంగా ఆవిష్కరిస్తూ ఈ 'కార్తీకమాసం..' నూ రూపొందించారు. మీడియాలో ట్రెండింగ్ అవుతోంది. కాగా ఇరుముడి సినిమాలోని పాటలన్నీ చార్ట్ బస్టర్ గా నిలిచింది. ముఖ్యంగా 'మల్లెపూల పల్లకి సాంగ్'కు ఆడియెన్స్ థియేటర్లలో పూజలు, హారతులు పడుతున్నారు. ఇటీవలే ఈ సాంగ్ ఫుల్ వీడియోను కూడా రిలీజ్ చేశారు మేకర్స్.


## ఇరుముడి' సూపర్ హిట్ సాంగ్.. ఫుల్ వీడియో వచ్చేసింది..

## ఆ సినిమా ఫ్లాప్‌తో నా ఆలోచన పూర్తిగా మారిపోయింది



ఒక సినిమా ఫ్లాప్ అయినప్పుడు అది దర్శకుల ఆలోచనలను, సినిమా తీసే విధానాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో దర్శకుడు రామ్ గోపాల్ వర్మ గతంలో ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర కామెంట్స్ చేశారు. ప్రస్తుతం రామ్ గోపాల్ వర్మ ఓ ఇంట్రెస్టింగ్ సినిమా తెరకెక్కిస్తున్నాడు. ఇటీవలే ఆ సినిమాను అనౌన్స్ చేశారు ఆర్జీవీ. ఇక ఆర్జీవీ చేసే వ్యాఖ్యలు సంచలనంగా మారుతుంటాయి. కాగా గతంలో ఓ ఇంటర్వ్యూలో ఆర్జీవీ మాట్లాడుతూ.. ముఖ్యంగా, ఒక ఫెయిల్యూర్ తర్వాత తన దృక్పథం ఎలా మారిపోయిందో ఆయన ఆసక్తికరంగా వివరించారు. సినిమా విజయం కేవలం స్టార్ కాంబినేషన్లపైనే ఆధారపడదనే వాస్తవాన్ని ఆయన వివరించారు.ఈ ఇంటర్వ్యూలో ఆర్జీవీ ఒక ఆసక్తికరమైన ఉదాహరణను ప్రస్తావించారు. "బాహుబలి" సినిమా నిర్మాణ సమయంలో శివగామి పాత్ర కోసం మొదట శ్రీదేవికి ఆఫర్ వచ్చిందని దర్శకుడు రాజమౌళి వెల్లడించారు. అయితే, ఒక పెద్ద స్టార్ ను తీసుకురావడం వలన అయ్యే ఖర్చులు, ఇతర అంశాల కారణంగా శ్రీదేవిని కాకుండా రమ్యకృష్ణను ఎంచుకోవలసి వచ్చిందని రాజమౌళి పేర్కొన్నారు. చివరకు, రమ్యకృష్ణ ఆ పాత్రకు ప్రాణం పోసి, ఆ పాత్ర కోసమే ఆమె పుట్టారన్నంత అద్భుతంగా నటించారని ఆర్జీవీ గుర్తుచేశారు.సరైన పాత్రకు సరైన నటుడిని ఎంచుకోవడం చాలా ముఖ్యమని వివరించారు. ఒక సినిమా ఫ్లాప్ తర్వాత తాను నేర్చుకున్న ముఖ్యమైన పాఠాలలో ఇది ఒకటని ఆయన చెప్పుకొచ్చారు. ఇది దర్శకులు, నిర్మాతలు తమ నిర్ణయాలను మరింత వివేకంతో తీసుకోవాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తుంది. ఆర్జీవీ చేసిన ఈ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## ఆ హీరోలాగా ఉండడం ఎవరి వల్ల కాదు



హీరో శ్రీకాంత్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తెలుగు సినీ చరిత్రలో సూపర్ స్టార్ కృష్ణగారి విశిష్ట స్థానాన్ని, అలాగే సినిమా నిర్మాణంలో దర్శకుడి ప్రాముఖ్యతను వెల్లడించారు. శ్రీకాంత్ కృష్ణగారి నిజాయితీని, ధైర్యాన్ని ఎంతగానో మెచ్చుకున్నారు. ఒక సినిమా విజయవంతం కాలేదని తెలిసినప్పుడు, కృష్ణగారు ఏమాత్రం సంకోచించకుండా నా సినిమా ఫ్లాప్ అయ్యింది అని స్వయంగా చెప్పేవారని గుర్తుచేసుకున్నారు. అటువంటి అరుదైన ఫ్రాంక్‌నెస్, నిజాయితీ మరెవరిలోనూ కనిపించవని శ్రీకాంత్ అన్నారు. కృష్ణగారి డేరింగ్ అండ్ డాషింగ్ స్వభావాన్ని, ఆయన చేసిన సాహసాలను, ప్రయోగాలను శ్రీకాంత్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఎక్స్పెరిమెంటల్ చిత్రాలను నిర్మించడంలో, కొత్త టెక్నాలజీని పరిచయం చేయడంలో కృష్ణగారు ఎల్లప్పుడూ ముందుండేవారని, వాటి ఫలితాలు ఎలా ఉన్నా, ఆయన వాటి గురించి క్షణం కూడా ఆలోచించకుండా ముందుకు సాగేవారని తెలిపారు. సాధారణంగా సినిమా ఫ్లాప్ అయితే, కొందరు రచయితలనో, దర్శకులనో నిందించడం చేస్తుంటారని, కానీ కృష్ణగారు అటువంటి వారికి పూర్తి భిన్నమని శ్రీకాంత్ అన్నారు.తన సినీ ప్రయాణంలో, శ్రీకాంత్ దర్శకుడి పాత్రకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. దర్శకుడిని కెప్టెన్ ఆఫ్ ది షిప్గా అభివర్ణించారు. ఒక సినిమా విజయం లేదా అపజయం పూర్తిగా దర్శకుడి చేతుల్లోనే ఉంటుందని తెలిపారు. నటీనటులు కేవలం కథ విని, తమ పాత్రను పోషించి వెళ్ళిపోతారని, కానీ సినిమాకు ప్రాణం పోసేది, దానిని ఒక కళాఖండంగా మలిచేది దర్శకుడేనని శ్రీకాంత్ వివరించారు. కెమెరా డిపార్ట్‌మెంట్ నుండి మ్యూజిక్, డైలాగుల వరకు, ప్రతి షాట్‌లో అందం, విజువల్స్, ఎక్స్ప్రెషన్స్, ఎమోషన్స్‌ను పర్యవేక్షించేది దర్శకుడేనని ఆయన చెప్పారు. ఇరవై నాలుగు క్రాఫ్ట్స్‌ను సమన్వయం చేసే బాధ్యత దర్శకుడిదేనని, ఈ విషయంలో హీరోలు లేదా ఇతర సాంకేతిక నిపుణుల పాత్ర పరిమితమని ఆయన అన్నారు.